

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

16 ఫిబ్రవరి 2026 | పేజీలు : 08 | సోమవారం




- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి
- రూ. 1.50 కోట్లతో ఆలయ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాం
- త్వరలోనే టెండర్లు పిలిచి మార్చిలోనే పనులు మొదలు పెడతాం

# చరిత్రలో నిలిచేలా.. నాగేశ్వరాలయాన్ని పునర్నిర్మిస్తాం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

పెరుమాళ్లపాడులోని పురాతన శ్రీ నాగేశ్వరస్వామి శివాలయాన్ని అత్యంత వైభవంగా చరిత్రలో నిలిచేలా నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి ఆనం, పెరుమాళ్లపాడులో ఎంపీపీ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ.. గ్రామంలో చారిత్రక, పురాతన ఆలయమైన శ్రీ నాగేశ్వర స్వామి ఆలయాన్ని గ్రామస్తులు అందరి ఆమోదం మేరకు పెన్నానదికి సమీపంలో నూతన ఆలయ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కూడా గుర్తించమని ఇప్పటికే అధికారులకు ఆదేశాలించినట్లు మంత్రి చెప్పారు. తొలుత 2021-22లో ఈ ఆలయాన్ని గ్రామంలోని


-మిగతా 2లో




## ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన

- 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా 'విద్యా బోధన'
- జలదంకి జెడ్పీ హైస్కూల్‌లో 'పది'పై ప్రత్యేక నజర్..

# టౌన్ ప్లానింగ్‌లో.. ఎవరికి వారే!



- చక్రం తిప్పుతున్న కొందరు ప్లానింగ్ కార్యదర్శులు
- వారి దెబ్బకు లబోదిబోమంటున్న ఎల్‌టీపీలు
- టౌన్ ప్లానింగ్‌పై దృష్టి పెట్టని అధికారులు
- బినామీ లాగిన్‌లతో కార్యక్రమాలు

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

భవన నిర్మాణాలకు సంబంధించి ఎల్‌టీపీల ద్వారా ప్రక్రియ జరగాల్సి ఉంది. ఆన్‌లైన్ ద్వారా జరిగే ఈ ప్రక్రియలో కొంత మంది ప్లానింగ్ కార్యదర్శులు బినామీల లాగిన్‌లు పెట్టి కొందరు

-మిగతా 2లో

నగరపాలక సంస్థలో కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగం పై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో ఆ విభాగంలో ఎవరికి వారే అన్నట్టుగా మారిందని పలువురు అంటున్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు కొరత తీవ్రంగా ఉండడంతో కొంతమంది ప్లానింగ్ కార్యదర్శులకు కల్ప వృక్షంగా మారింది. దీంతో టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించిన మొత్తం కార్యక్రమాలు తామే చూసుకుంటామంటూ తమకు ఇవ్వవలసినది ఇస్తే, మొత్తం భవన నిర్మాణానికి సంబంధించి అప్రూవల్ చేసేస్తామంటూ కొందరు ప్లానింగ్ కార్యదర్శులు కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నట్లు సమాచారం. కొంతమంది ప్లానింగ్ కార్యదర్శులు ఆడింది ఆట, పాడింది పాటగా ఈ విభాగంలో జరుగుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రాష్ట్రవ్యాప్తంగా శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ

- పకడ్బందీ ఏర్పాట్లు
- ఆలయాల్లో దర్శన ఏర్పాట్ల పట్ల సంతృప్తితో భక్తులు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాల్లో లక్షలాది భక్తులు మహాదేవుడిని దర్శించుకుంటున్నారని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రముఖ శైవక్షేత్రాలను స్వయంగా సందర్శించారు. సంగంలోని శ్రీ కామాక్షి సమేత సంగమేశ్వరస్వామి ఆలయం, ఆత్మకూరులోని శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం, కాశీనాయన ఆశ్రమ శివాలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొని

-మిగతా 2లో

# శివనామస్మరణతో మార్మోగిన ఆలయం

## వైభవంగా శ్రీఅన్నపూర్ణాసమేత శ్రీకాశీవిశ్వేశ్వరుల కళ్యాణోత్సవం - భారీగా అన్నదానం - పూజల్లో మంత్రి ఆనం


**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలో వెలసియున్న శ్రీశ్రీశ్రీ అన్నపూర్ణాసమేత కాశీవిశ్వేశ్వరాలయంలో ఆదివారం శివరాత్రి వేడుకలను ఆలయ భక్తమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవం ఆలయ ప్రధానఅర్చకులు, రాష్ట్ర అర్చక, పురోహిత సంఘ అధ్యక్షుడు బ్రహ్మశ్రీ మేళ్ళచెరువు శివకుమార్‌శర్మ (శివయ్యస్వామి) ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆలయం సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలనంతరం మంత్రి స్వామి, అమ్మవార్లను సందర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు శివయ్యస్వామి మంత్రికి జ్ఞాపికను అందజేశారు. అమ్మవారు, స్వామి వార్ల కళ్యాణోత్సవాన్ని వీనులవిందుగా నిర్వహించగా, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం 11 గంటలకు జరుగనున్న స్వామి, అమ్మవార్ల కళ్యాణోత్సవానికి ఉభయకర్తలుగా రేవూరుకు చెందిన డాక్టర్ దేవిరెడ్డి కార్తీకేయరెడ్డి, మైథిలి (అమెరికా), మాజీ జెడ్పీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, కవిత దంపతులు వ్యవహరించారు. ఉదయం 11.30 గంటల నుండే పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం రాత్రి వరకు నిర్వహించారు. ఆదివారం ఉదయం 3 గంటలకు ఆలయంలో స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం భక్తబృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 5 గంటలకు తాళ్ళూరు చంద్రశేఖర్, పుష్పలత దంపతులు ఉభయకర్తలుగా అమ్మవారికి చందనాలంకారం, ఉదయం 7 గంటలకు పుచ్చలపల్లి రవీంద్రారెడ్డి, రాధిక దంపతులు ఉభయకర్తలుగా పార్థివలింగ రుద్రాక్ష లింగాభిషేకం, త్రిశతాధిక కలశాభిషేకం, ఉదయం 11గంటలకు శ్రీవార్ల కళ్యాణోత్సవం, 11.30 గంటలకు దివంగత పుచ్చలపల్లి రామిరెడ్డి గతంలో ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు శ్రీఅన్నపూర్ణాసమేత కాశీవిశ్వేరస్వామివార్లకు పి.జవహర్‌లాల్, రమణమ్మ దంపతులు



ఉభయకర్తలుగా అష్టోత్తర శతకలశాభిషేకం, రాత్రి 10 గంటలకు లింగోద్భవకాలంలో శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామివార్లకు కుక్కపల్లి శ్రీనివాసులునాయుడు, కిరణ్మయి దంపతులు ఉభయ కర్తలుగా అన్నాభిషేకం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రా భిషేకం నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భక్తులు విరివిగా హాజరై స్వామి, అమ్మవార్లను సందర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామి,అమ్మవార్ల కృపకు పాత్రులయ్యారు. ఈఉత్సవాల సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడగా శివనామ స్మరణతో మార్మోగింది. ఆలయాన్ని అత్యంత ఆకర్షణీయంగా అలంకరించారు. రాత్రి భక్తులు వందలాదిగా ఆలయ ప్రాంగణంలో జాగరణ చేశారు. ఆలయ ఆవరణలో నందీశ్వరుడు, తదితర ప్రతిమలను ఏర్పాటుచేయగా భక్తులు దర్శించుకున్నారు.



# చిత్రకళలో రమణరావు ప్రతిభ



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన కరటంపాడు గ్రామస్తుడు పేరం రమణరావు చిత్రకళా రంగంలో ప్రతిభను కనబరిచి జాతీయస్థాయిలో అనేక అవార్డులను పొందారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దావా పెంచలరావు స్వగృహంలో ఘనంగా సన్మానించారు. ఇలాంటి ప్రతిభ కలిగిన పేరం రమణరావు లాంటి వారిని ప్రభుత్వం గుర్తించి ఇలాంటి కళాకారులను ప్రోత్సహించాలని రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు కోరారు. కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖ న్యాయవాది నందా ఓబులేసు, 14వ వార్డు టిడిపి ఇంచార్జ బీసీ నాయకులు ఒంటేరు మల్లికార్జున యాదవ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు శ్రీరాములు, బాలయ్య, షాజహాన్, ఆత్మకూర్ టిడిపి నాయకులు కోలా నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రవ్యాప్తంగా శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ

*(మొదటి పేజీ తరువాయి)*

భక్తులతో మమేకమయ్యారు. అనంతరం చేజర్ల మండలం పెరుమాళ్లపాడులోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ శివాలయాల్లో ప్రశాంత వాతావరణంలో దర్శనాలు కొనసాగుతున్నాయని, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ముందస్తుగా సమగ్ర ఏర్పాట్లు చేపట్టామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. గత ప్రభుత్వంలో వేలల్లో వచ్చే భక్తుల సంఖ్య తమ ప్రభుత్వ హయాంలో ఆలయాల పట్ల తమ ప్రభుత్వం చూపుతున్న నిబద్ధత, ప్రత్యేక ఏర్పాట్లతో లక్షలాదిగా భక్తులు తరలివస్తున్నారని చెప్పారు. గత 20 రోజుల నుంచి ప్రధాన శైవ క్షేత్రాల్లో మహాశివరాత్రి ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సమర్ధవంతమైన ఏర్పాట్లు చేసిందన్నారు. ముఖ్యంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానం, శ్రీకాళహస్తి శ్రీ కాళహస్తీశ్వర స్వామి దేవస్థానం, కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం, మహానంది శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానం, యాగంటి ఉమామహేశ్వర స్వామి దేవస్థానం, ద్రాక్షారామం భీమేశ్వర స్వామి దేవస్థానం తదితర 42 ప్రధాన శైవక్షేత్రాల్లో భక్తుల రద్దీ భారీగా కొనసాగుతోందని తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం వరకే కోటప్పకొండ, శ్రీశైలం, శ్రీకాళహస్తి ప్రాంతాల్లో 50 నుంచి 60 వేల మంది భక్తులు దర్శించుకున్నారని, అర్ధరాత్రి వరకు రద్దీ కొనసాగనుందని చెప్పారు. సాయంత్రం నుంచి లక్షలాదిగా భక్తులు తరలిరానున్నారని అంచనా వేశారు. క్యూ లైన్లు సజావుగా కొనసాగుతున్నాయని, తాగునీరు, ప్రసాదం, వైద్య శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు సమర్ధవంతంగా అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఆగమ పండితుల ఆదేశాల మేరకు పూజా కైంకర్యాలు నిర్వహించాలని స్పష్టమైన సూచనలు ఇచ్చామని తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణతో పాటు ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పురాతన ఆలయాల పునర్నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి ఆనం స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసంతో ఆలయాలు కళకళలాడడం ఆనందదాయకమని పేర్కొన్నారు. మహాశివరాత్రి రోజున మంత్రిగా ప్రసిద్ధ శైవ క్షేత్రాలను సందర్శిస్తూ భక్తులతో మమేకమై మహాదేవుని కరుణాకటాక్షాలు పొందడం తన పూర్వజన్మ సుకృతమని, దేవాదాయ శాఖ మంత్రిగా ప్రతి ఆలయాన్ని సందర్శించే మహాభాగ్యం కలగడం, ఆలయాల అభివృద్ధిలో పాలు పంచుకోవడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, టిడిపి నాయకులు తాళ్లూరు గిరినాయుడు, వేలూరు కేశవ చౌదరి, తుమ్మల చంద్రారెడ్డి, వెంకటరమణమ్మ, వేణుగోపాల్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, పులిమి శైలజారెడ్డి, కొప్పోలు రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రలో నిలిచేలా నాగేశ్వరాలయాన్ని

# పునర్నిర్మిస్తాం

*(మొదటి పేజీ తరువాయి)*

యువత గుర్తించారని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇసుకదిన్నెల్లో కూరుకుపోయిన ఆలయాన్ని అధికారులు పూడిక తీసి పరిశీలించినట్లు చెప్పారు. ఆలయంలో వెతికితే గణపతి, శివలింగం, నాగ ప్రతిష్టలు వెలుగు చూసినట్లు చెప్పారు. అత్యంత పురాతనమైన ఆలయం కావడంతో దేవాదాయ శాఖ, పురావస్తు శాఖ అధికారులతో చర్చించి సిద్ధాంతపరమైన ఆగమ శాస్త్రం ప్రకారం నూతన ఆలయ నిర్మాణానికి రూ.1.50 కోట్లతో ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా అవసరమైన నిధులను కూడా మంజూరు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. పూర్వీకులు వారసత్వంగా అందించిన ఈ పురాతన ఆలయాన్ని భక్తుల మనోభావాలకు అనుగుణంగా చరిత్రలో నిలిచిపోయేలా నిర్మిస్తామని ఆనం పునరుద్ఘాటించారు. తమ ప్రభుత్వ హయాంలో పెరుమళ్ళపాడు గ్రామంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. 20 లక్షలతో విడతలవారీగా సిమెంట్ రోడ్లు, మరో 15 లక్షలతో సిమెంట్ రోడ్లు, 22 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ నిర్మాణం, రూ.10 లక్షలతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. అలాగే మాముడూరు- గొల్లపల్లి మీదుగా రూ.4 కోట్లతో పెరుమాళ్లపాడు గ్రామంలో నూతన రహదారి మంజూరు చేసినట్లు చెప్పారు. 3 కోట్లతో సబ్‌స్టేషన్ మంజూరు అయిందని, టెండర్లు పిలిచి త్వరలోనే పనులు మొదలు పెడుతున్నట్లు చెప్పారు. అన్ని విధాలా కూడా పెరుమాళ్లపాడు గ్రామ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# టౌన్ ప్లానింగ్‌లో ఎవరికి వారే !

*(మొదటి పేజీ తరువాయి)*

వారే మొత్తం చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో సిటీప్లానర్, డిప్యూటీ సిటీప్లానర్ లేకపోవడంతో ఉన్న ఇన్చార్జి అధికారి పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయలేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని పలువురు ఎల్‌టీపీలు చర్చించుకుంటున్నారు. ఈ విభాగంలో ప్రతి పనికి ఒక రేటు ఉండడంతో, కొంతమంది ప్లానింగ్ కార్యదర్శులకు అడిగిన నగదు వారు ఇచ్చుకోలేక చాలా మంది భవన నిర్మాణాలకు సంబంధించి ముందుకు రాలేకపోతున్నారు. ప్రస్తుతం బీపీఎస్, ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికీ వీటిపై టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎక్కువ శాతం ప్లానింగ్ కార్యదర్శులే కొందరు వారి స్నేహితుల లాగిన్‌ల ద్వారా చేస్తున్నట్లు సమాచారం. ఈ విషయం టౌన్ ప్లానింగ్ విభాగంలో కొందరు అధికారులకు తెలిసినప్పటికీ వారికి చేరవలసినది చేరుతుండడంతో వాటిపై దృష్టి పెట్టకుండా.. అలాంటి వాటికి అనుమతులు మంజూరు చేస్తున్నట్లు సమాచారం. కొంతమంది ప్లానింగ్ కార్యదర్శులకు అర్హత లేకపోయినా ఇక్కడున్న అధికారులు వారిలో కొందరికి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఇన్చార్జి బాధ్యతలు అప్పగించడం విశేషం. వీరి వల్ల ఆయా సచివాలయాల్లో ప్లానింగ్ కార్యదర్శుల కొరత ఏర్పడింది. కనీసం వారికి కేటాయించిన సచివాలయాలకు వారు వెళ్లకుండా నగరపాలక సంస్థ కార్యాలయంలోనే ఉంటూ చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. నగరపాలక సంస్థ విభాగంలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ విభాగంలో కొందరు ఆడింది ఆట, పాడింది పాటగా మారిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడున్న కొంతమంది టౌన్‌ప్లానింగ్ అధికారులకు, కొందరు రాష్ట్ర టౌన్‌ప్లానింగ్ అధికారుల అండదండలు ఉన్నట్లు సమాచారం. దీంతో ఎంతో రాబడి ఉన్న నెల్లూరు నగరపాలక సంస్థ ఆదాయానికి ఇష్టానుసారంగా గండి కొడుతున్నట్లు సమాచారం. గత కొంతకాలం నుంచి సిబ్బంది కొరత ఉన్న ఇంతవరకు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ దృష్టికి వారు తీసుకోకపోగా ఖాళీలను భర్తీ చేయకపోవడం విశేషం. ఇక్కడ నగరపాలక సంస్థలో కొందరు కలిసి ఇష్టానుసారంగా భోంచేస్తున్నారు. ఇట్టి వారిపై నిఘు పెట్టకపోవడంతో లక్షల రూపాయల నగరపాలక సంస్థ రాబడి గండి పడుతుందని పలువురు అనుకుంటున్నారు. నగరంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై పరిశీలించి నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్.. కొందరు కార్యదర్శులకు మందలించినా, వారిలో ఇంతవరకు మార్పు రాకపోవడం విశేషం. ఒక కార్యదర్శి సెలవు పెట్టి ఒక ప్రైవేటు కార్యాలయాన్ని కూడా పెట్టి టౌన్‌ప్లానింగ్ విభాగం యొక్క కార్యక్రమాలు తన వద్ద చేయించుకోవాలని చేస్తున్నట్లు తెలిసింది. ఇకనైనా మంత్రి నారాయణ ఈ విభాగంపై ప్రత్యేక దృష్టి పెట్టి నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగంలో కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతున్న అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులను ప్రక్షాళన చేసి.. ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి అట్టి వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవకాశం ఎంతైనా ఉంది.

# న్యూరో స్పియర్ 2026.. జాతీయ స్థాయి వైద్య సదస్సు

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో ఫిబ్రవరి 15, 2026న 'న్యూరో స్పియర్ 2026' పేరిట భారీ జాతీయ స్థాయి వైద్య సదస్సు ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. మెడికవర్ హాస్పిటల్స్, విక్రమ సింహపురి న్యూరో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సు, నరాల వ్యాధుల (న్యూరోలజీ అండ్ న్యూరోసర్జరీ) నిర్ధారణ, చికిత్సలో వస్తున్న అత్యాధునిక మార్పులపై ప్రధానంగా దృష్టి సారించింది. ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకు సాగిన ఈ కార్యక్రమంలో స్ట్రోక్ మేనేజ్‌మెంట్, ఎమర్జెన్సీ మరియు క్రిటికల్ కేర్ వంటి కీలక అంశాలపై జాతీయ స్థాయి నిపుణులు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సదస్సుకు హాజరైన వైద్యులకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ (ఏపీఎంసి) ద్వారా రెండు క్రెడిట్ పాయింట్లను కూడా కేటాయించడం విశేషం. సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ సెషన్లలో నిపుణులు ప్రసంగిస్తూ.. డాక్టర్ పి.దీక్షాంతి నారాయణ్ 'అజ్ఞాత పక్షవాతం' పై, డాక్టర్ బాల ఖాసీం 'త్రోంబోలిసిస్' ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. న్యూరో సర్జరీ విభాగంలో డాక్టర్ జి. దినేష్, డాక్టర్ ఉదయ్ కిరణ్ తలకు తగిలే గాయాలు, తదుపరి చికిత్సల గురించి చర్చించగా, డాక్టర్ ఎంఎన్ ప్రకాష్, డాక్టర్ పునుగోటి గౌతమ్ అత్యవసర పరిస్థితులు, అవయవ దాన నిర్వహణపై మాట్లాడారు. అలాగే, న్యూరో ఆంకాలజీలో వస్తున్న సవాళ్లపై డాక్టర్ మౌనిక రెడ్డి, డాక్టర్ జి.హరిప్రియ ప్రసంగించగా, ఎన్సెఫలోపతి,




న్యూరో ఇంటర్వెన్షన్స్ వంటి అంశాలపై డాక్టర్ వై.రఘు నందినిరెడ్డి, డాక్టర్ ఎన్.కృష్ణతేజ, డాక్టర్ కెవిస్ విశ్వకుమార్ తమ మేధోమథనాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో విక్రమ సింహపురి న్యూరో క్లబ్ ప్రతినిధులు డాక్టర్ ఏ.వి. రమణ మూర్తి, డాక్టర్ ఎన్ఎస్ సంపత్ కుమార్, డాక్టర్ పిఎస్ రెడ్డి, ఏపీ మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ అశోక్ రెడ్డి పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా 21 మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులతో అగ్రగామిగా ఉన్న మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరు ప్రజలకు అంతర్జాతీయ ప్రమాణాలతో వైద్య సేవలు అందించడమే కాకుండా, ఇటువంటి సదస్సుల ద్వారా వైద్య రంగంలో నిరంతరం జ్ఞాన మార్పిడికి కృషి చేస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# పాతూరు శివాలయాన్ని దర్శించుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** మహాశివరాత్రి సందర్భంగా కావలి పట్టణంలోని పాత ఊరు శివాలయాన్ని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ఆదివారం పరమేశ్వరునికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కావలి నియోజకవర్గం ప్రజలందరికీ శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. శివుని ఆశీర్వాదాలు దీవెనలు కావలి ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శివుని అనుగ్రహంతో కావలి పట్టణం మరింత అభివృద్ధి చెందాలని భవిష్యత్తులో అగ్ర పట్టణంగా ఎదిగే దిశగా ముందు సాగాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రధాన అర్చకుల కుటుంబం ఎన్నో సంవత్సరాలుగా అంకితభావంతో ఆలయ సేవలు నిర్వహిస్తూ, దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తున్నారని వారు కృషిని ప్రశంసించారు, ప్రభుత్వ సహకారం భక్తుల సహాయ సహకారాలతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ ఆలయానికి కమిటీ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ధర్మకర్తలు అర్చకులు ఆలయ సిబ్బంది సమిష్టి కృషితో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నందుకు వారికి కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 11 రోజులు పాటు జరిగే బ్రహ్మోత్సవాలను ప్రజలందరూ దర్శించుకుని దేవుని ఆశీస్సులు పొందాలని తెలిపారు. శివుని కృపతో కావాలని నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి సాధించి ప్రజలకు శ్రేయస్సు కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో అరవ రాధా కృష్ణ, అర్చకులు, ధర్మకర్తలు, ప్రజాప్రతినిధులు, భక్తులు, పాల్గొన్నారు.

# రాష్ట్ర బడ్జెట్లో చేనేతలకు అన్యాయం



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** చేనేత సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు కటికాల వెంకటేశ్వర్లు, పముజుల శంకరయ్య, పముజుల హరి ఆధ్వర్యంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. 2026 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బడ్జెట్లో చేనేతలకు అన్యాయం జరిగిందని తెలియజేశారు. అదేవిధంగా చేనేత రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యంతో వివక్షతతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయి. మొన్న ప్రకటించిన కేంద్ర బడ్జెట్లో కేంద్రం చేసిన అన్యా యాన్ని మరవకముందే రాష్ట్ర ప్రభుత్వం కూడా అదే అన్యాయాన్ని కొనసాగించడం జరిగిందని తెలిపారు. అలాగే వ్యవసాయం తర్వాత అత్యంత కీలకమైన చేనేత రంగం అనేకమందికి ఉపాధి కలిగించే ఈ వ్యవస్థను బడ్జెట్లో పట్టించుకోకపోవడం తీవ్ర అసహనానికి గురి చేసి చేసిందని పేర్కొన్నారు. అలాగే చేనేతరంగానికి రాష్ట్ర బడ్జెట్లో వెయ్యి కోట్లు కేటాయించాలని వాస్తవిక ఆధారాలతో విన్నవించినప్పటికీ వాటిని ప్రభుత్వం పట్టించుకోలేదు. 3,32,204 కోట్ల రాష్ట్ర ఆర్థిక బడ్జెట్లో చేనేతలకు 115 కోట్లు మాత్రమే కేటాయించడం చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా యూనిట్ మాల్కోకు 86 కోట్లు ప్రకటించడం జరిగింది. ఈ విధంగా ఫిబ్రవరి 22వ తారీకు మంగళగిరిలో జరగబోయే చేనేత గర్జనలో ప్రభుత్వ చర్యలను ఐక్య కార్యాచరణ కమిటీగా మేమందరం కలిసి చేనేత గర్జన వేదికగా ప్రతిఘటించడం జరుగుతుందని తెలిపారు. అలాగే గత జాతీయ చేనేత దినోత్సవం నాడు ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా ముఖ్యమంత్రి ప్రకటించిన 25వేల రూపాయల నేతన్న భరోసా పథకానికి కూడా నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం వహించారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆప్కో, ప్రభుత్వం నుంచి చేనేత సహకార సంఘాలకు రావలసిన 203కోట్ల రూపాయలు బకాయిలు చెల్లించాలని కోరినా దాని గురించి ప్రస్తావించలేదు. త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద 17.7కోట్లు రావాల్సి ఉండగా కేవలం 5కోట్లు కేటాయించడం దారుణమని తెలియజేశారు. కావున మాకు జరిగిన అన్యాయాన్ని ప్రభుత్వం గుర్తించి చేనేత రంగానికి కేటాయింపులు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత నాయకులు కార్మికులు పాల్గొన్నారు.

# మహాశివుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలి : మాజీ చైర్మన్ చంచల బాబు యాదవ్



**సీతారామపురం, మేజర్‌న్యూస్ :** ఆ మహా శివుని ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ చంచల్ బాబు యాదవ్ తెలిపారు. ఆదివారం నాడు మండల పరిధిలోని గుట్టికసిద్దేశ్వర ఆలయంలో మహా శివునికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మండల కన్వీనర్ సిహెచ్ బయన్న యాదవ్ ఎస్సీ సెల్ అధ్యక్షులు నల్లిపోవు రాజా ఉడత సుమన్ చల్ల గొలుసు రమణయ్య ఎస్.లక్ష్మయ్య అంబటి మస్తాన్ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం

▶ జిల్లా సూపరిండెంటింగ్ ఇంజనీరు కే.రాఘవేంద్రం



**నెల్లూరు/వేదాయపాలెం, మేజర్‌న్యూస్ :** విద్యుత్ సమస్యల సత్వర పరిష్కార దిశగా ఏపీ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు నెల్లూరు సర్కిల్ కార్యాలయంలో సోమవారం చేపడుతున్న 'డయల్ యువర్ ఎస్ఈ' కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సూపరిండెంటింగ్ ఇంజనీరు కే.రాఘవేంద్రం పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన అధికారికంగా విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా ఉన్నాయి. సోమవారం ఉదయం 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు నిర్వహించే డయల్ యువర్ ఎస్ఈ కార్యక్రమం ద్వార సమస్యలు తెలుపుకొని పరిష్కరించుకునేందుకు ఫోన్ నెంబర్ 0861-2320427కు కాల్ చేసి కానీ, లేదా నేరుగా సంబంధిత అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా వినియోగదారుల నుండి నేరుగా సమస్యలను స్వీకరించి, వాటిని సత్వరంగా పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రతి సోమవారం ఉదయం 8.30 గంటల నుండి 9.30 గంటల వరకులి నిర్వహించే డయలు యువర్ విద్యుత్ ఎస్ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వినియోగదారులు 0861-2320427 నెంబర్‌కు ఫోన్ చేసి తమ విద్యుత్ సంబంధిత సమస్యలు, సూచనలు నేరుగా తెలియజేయవచ్చని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# కాకుపల్లి శివాలయం వద్ద అన్నదానం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ పరిధిలోని కాకుపల్లి గ్రామంలోని ఉదయకళేశ్వర స్వామి దేవస్థానం వద్ద మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కుంచనపల్లి వెంకటరత్నం ఆధ్వర్యంలో 5వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం నుంచి కాకుపల్లి శివాలయంలో పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకుపల్లి టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ ఉప్పల ఈశ్వరయ్య, ఏఎంసీ డైరెక్టర్ కుంచనపల్లి శివకుమార్ మాట్లాడుతూ.. గత 40 ఏళ్లుగా తమ గ్రామంలో శివరాత్రి మహోత్సవాలన్న పెద్ద వైభవంగా నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈరోజు సాయంత్రం కళ్యాణ మహోత్సవం, గ్రామ ఉత్సవం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కోసురు సుభాషిణి, కేశవులతోపాటు పలువురు స్థానిక నేతలు వెంకటేష్, నవీన్, రాజశేఖర్, మస్తాన్, శేషయ్య, సురేంద్ర, కళ్యాణ్, రాము పాల్గొన్నారు.

# కమనీయంగా అన్నపూర్ణ ఓంకారేశ్వరుల కళ్యాణం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని ప్రసన్నరెడ్డి నగర్‌లో వేంచేసియున్న అయ్యప్పస్వామి ఆలయంలోని శ్రీ ఓంకారేశ్వరుడు అన్నపూర్ణాదేవిల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగ నిర్వహించారు. ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఉదయాన్నే గణపతి పూజ పుణ్యాహవచనం నిర్వహించారు. తదనంతరం స్వామివారికి మహా రుద్రాభిషేకం పంచామృతాభిషేకం జరిపించి భక్తులకు ప్రసాద వితరణ గావించారు. ఉదయం 10 గంటలకు ఓంకారేశ్వరుని అన్నపూర్ణాదేవిని ప్రత్యేకంగా వధూవరులుగా పట్టు వస్త్రాలతో అలంకరింపజేసి శాస్త్ర విధిగా కళ్యాణ వేదికపై అధిష్టింప చేశారు. ఆలయ అర్చకులు వివాహ తంతును శాస్త్ర విధిన నిర్వహించారు కళ్యాణ ఘట్టం సనాతన ధర్మ సమ్మతంగా గుణజీర ధారణ తలంబ్రాలను పోసి అమ్మవారి కళ్యాణాన్ని కన్నుల పండుగ జరిపించారు. భక్తులు ఆ దృశ్యాన్ని తిలకించి ఆనంద పరవశులయ్యారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు ప్రదోషకాలంలో స్వామివారిని అమ్మవారిని సుగంధ పరిమళ పుష్పమాలలతో అలంకరింపబడిన రథంపై అదృష్టం చేసి గ్రామోత్సవానికి తరలివచ్చారు. భక్తులు కాయ కర్పూరం చెల్లించి స్వామివారిని అమ్మవారిని దర్శించుకుని ఆనందపరవశులయ్యారు. అదేవిధంగా రాత్రికి లింగోత్వ సమయంలో స్వామి వారి కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు లింగోద్భవ కార్యక్రమాలను తిలకించేందుకు ఎంతో భక్తితో ఆలయంలో చేరుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ గావించి స్వామివారి కరుణాకటాక్షములు కలిగే విధంగా ఆలయ నిర్వహణ కమిటీ పర్యవేక్షించారు.

# భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు





**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లావ్యాప్తంగా మహాశివరాత్రి పర్వదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. నెల్లూరు నగరంలోని చారిత్రాత్మక ఆలయాలన్నీ తెల్లవారుజాము నుంచే భక్తుల రాకతో కిటకిటలాడాయి. 'ఓం నమః శివాయ' అనే పంచాక్షరీ మంత్రోచ్చారణలతో శివాలయాలు మారుమ్రోగిపోయాయి. భక్తులు పవిత్ర నదులలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. నెల్లూరు మూలాపేటలోని ప్రసిద్ధ మూలస్థానేశ్వర స్వామి ఆలయం భక్తుల రద్దీతో కోలాహలంగా మారింది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీలు, అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే నగరంలోని విరాట్ నగర్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, రామలింగేశ్వర స్వామి ఆలయం, ఇతర శివాలయాల్లో భక్తులు శివలింగాలకు పాలాభిషేకాలు నిర్వహించారు. రాత్రంతా శివయ్య సన్నిధిలో జాగరణ చేస్తూ భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నగరంలోని ప్రధాన వీధులన్నీ విద్యుత్ దీపాల కాంతులతో ధగధగలాడాయి. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించగా, స్వచ్ఛంద సంస్థలు భక్తులకు పాలు, పండ్లు, మంచినీటి సౌకర్యాన్ని కల్పించాయి. మూలాపేట శ్రీ మూలస్థానేశ్వర స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్, సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్ని విధాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయంలో ఉదయం గిన్నె బిక్ష కార్యక్రమం, రాత్రి లింగోద్భవం, వెండి నంది వాహనంపై శివపార్వతుల దర్శన భాగ్యం కల్పించారు. ఈ ఉత్సవం తిలకించేందుకు భక్తులు విశేషంగా తరలి వచ్చారు.

## సోమేశ్వర ఆలయంలో శివపార్వతుల కళ్యాణం



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని సోమశిల గ్రామంలోని శ్రీ కామాక్షి సమేత సోమేశ్వర ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా శివాలయ ప్రాంగణంలో శివపార్వతుల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా వైభవంగా జరిగింది. అనంతరం భక్తుల ఓం నమఃశివాయ పంచాక్షరి మంత్రోచ్చారణతో సోమేశ్వరాలయం మారు మ్రోగింది ఉభయకర్తలగా వంశపారంపర్య ధర్మకర్తలు ఉప్పల సోమసుందర మూర్తి, ఉప్పుల విజయ్‌కుమార్ దంపతులు వ్యవహరించారు. శివపార్వతుల కళ్యాణ మహోత్సవం కథనాన్ని ఆలయ ప్రధాన అర్చకులు రామకృష్ణ శర్మ వివరించారు. రామకృష్ణ శర్మ శివపార్వతుల కళ్యాణ మహోత్సవం కథలు భక్తులను ఆకట్టుకున్నది. అనంతరం భక్తులు శివపార్వతుల కళ్యాణ మహోత్సవానికి చదివింపులు ఇవ్వడం జరిగింది. సోమశిల రామాలయ ప్రధాన అర్చకులు శశికళాధర్ శర్మ, ఇతర అర్చకులు పాల్గొన్నారు.

## శివనామతో మార్మోగిన శైవ క్షేత్రాలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** పరమశివునికి అత్యంత ఇష్టమైన మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం శైవ క్షేత్రాలన్నీ శివ నామ స్మరణతో మార్మోగాయి వింజమూరులోని శ్రీ గంగా అన్నపూర్ణేశ్వరి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయం భక్తులతో క్రిక్కిరిసిపోయింది. ఉదయాన్నే అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని హరహర మహాదేవ శంభోశంకర అంటూ ఆలయం చుట్టూ ప్రదక్షిణాలు కావించి మొదటగా ధ్వజస్తంభ దర్శనం చేసుకుని ఆలయంలోని ప్రవేశించారు. నందీశ్వరుని నందీశ్వరుని దర్శనం చేసుకుని కాశీ విశ్వేశ్వర స్వామివారిని అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ చెన్న కేశవస్వామి వారి ఆలయంలో భక్తులు ఉదయాన్నే ఆలయాన్ని చేరుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు తిరుమలానగర్లోని కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వరుని ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. అదేవిధంగా నల్లగొండలోని నీలగిరి పర్వతం పై వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపించారు. కొండ దిగువభాగంలో ఉన్న మల్లేశ్వరి స్వామి ఆలయంలో త్రయంబికా దేవితో కలిసి ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే లింగోద్వ సమయం అయినా రాత్రి 12 గంటలకు కళ్యాణ మహోత్సవాన్ని జరిపించనున్నారు. అదేవిధంగా వింజమూరు నైరుతి దిక్కున కొలువైయున్న శ్రీ వింత పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాలు జరిపించారు. భక్తులు ఆయా ఆలయాలకు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయాల రాణాచకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించి స్వామివారి కృపకు పాత్రులయ్యేలా చేశారు.

## నేడు భారత్ సింధూర్ ఇండస్ట్రియల్ పార్క్ సందర్శన

● టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఆమంచర్ల గ్రామం నందు భారత్ సింధూర్ ఇండస్ట్రియల్ పార్క్ సందర్శన కార్యక్రమ ఏర్పాట్లను టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పరిశీలించడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఆమంచర్ల గ్రామం నందు మొత్తం 59.61 ఎకరాలలో భారత్ సింధూర్ ఇండస్ట్రియల్ పార్క్, అందులో మొదటి దశలో 29.62 ఎకరాలలో 7కోట్ల రూపాయలతో పనులు పూర్తి. భారత్ సింధూర్ ఇండస్ట్రియల్ పార్క్ ను రేపు ఉదయం 9:30 గంటలకు సందర్శించనున్న నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కావున ఆసక్తిగల పారిశ్రామికవేత్తలు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జి.వెంకటేశ్వర్లు నాయుడు (జివిఎన్), మల్లినేని వేణు నాయుడు, వాకా వెంకటేశ్వరులు, గంగయ్య, దాసరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గాయత్రి స్కూల్లో 12వ వార్షికోత్సవ వేడుకలు





**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని ఎమ్ఆర్ కన్వెషన్ హాల్లో శ్రీ గాయత్రి స్కూల్ 12వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా టీడీపీ మండలాధ్యక్షులు, పీఏసీఎస్ ఛైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మస్తాన్ బాబు మాట్లాడుతూ.. దిగ్విజయంగా 12 వసంతాలు పూర్తి చేసుకున్న శ్రీ గాయత్రి మేనేజ్మెంట్ వారికి శుభాకాంక్షలు తెలిపారు. స్కూల్ నిర్వహణ గురించి తాను నిత్యం వింటూనే వుంటానని.. చదువు, క్రమశిక్షణ, కల్చరల్ ప్రోగ్రామ్స్, ఆటపోటీలు ఇలా అన్ని అంశాల్లో ఎల్లపుడు ది బెస్ట్‌గా ఉంటారని అన్నారు. భవిష్యత్తులో కూడా ఇంకా మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. విద్యార్థులు ఉద్యోగాలతోపాటు, రాజకీయాల్లోకి కూడా రావాలని పిలుపునిచ్చారు. చదువుకున్న వారు రాజకీయాల్లోకి వస్తే నవ సమాజ నిర్మాణం సాకరం అవుతుందన్నారు. అనంతరం కరస్పాండెంట్ చైతన్య కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. 12 ఏళ్ల నుండి మాపై నమ్మకం పెట్టుకున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. స్కూల్ ప్రారంభం తొలి బ్యాచ్ విద్యార్థులను పిలిచి



సత్కరించారు. అలాగే తమ స్కూల్లో పనిచేస్తూ ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారిని ఘనంగా సన్మానించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వెంకటేశ్వర స్వామి వేషధారణ, కరాటే, అబాకాస్ ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రబాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మహాశివరాత్రికి ప్రత్యేక పూజలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన జలదంకిలోని సమేత జానకి రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు, స్వామివారి గిన్నె బిక్షాటన, రాత్రికి లింగోద్భవ పూజలు ఆలయ ప్రధాన అర్చకులు కుందుర్తి సతీష్ శర్మ ఆధ్వర్యంలో జరిగాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు కూరపాటి దయాకర్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు పులుగుంట మధుమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మహాశివరాత్రి వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మధుమోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎందరో దాతల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, ఎంపీ వేమీరెడ్డి ప్రభాకర్ రెడ్డి, చేవూరి జనార్దన్ రెడ్డిల సహకారం తోపాటు పలువురు సహకారం మరువలేనిది అన్నారు. 15, 16, 17 తేదీల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలియజేశారు. ప్రతి భక్తుడు స్వామి వారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.

# యువగళం స్ఫూర్తితో.. సర్వేపల్లిలో సైకిళ్ల జాతర..

- 3132 సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టిన సోమిరెడ్డి
- విరువూరులో విద్యార్థినులకు సైకిళ్ళు పంపిణీ చేసిన ? యువనేత రాజగోపాల్ రెడ్డి
- మార్చి 29 నాటికి సైకిళ్ల పంపిణీ పూర్తి చేస్తాం : సోమిరెడ్డి



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర స్ఫూర్తితో సర్వేపల్లి నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు సైకిళ్ళు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, యువనేత సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి నిర్ణయించారు. ఇందులో బాగంగా యువగళం పాదయాత్ర ప్రారంభించిన జనవరి 27వ తేదీన పొదలకూరు మండలం విరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. పాఠశాలలో 8, 9 తరగతులు చదువుతున్న విద్యార్థినులకు సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సైకిళ్ళు అందజేశారు. ఆ సందర్బంగా సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. 2019–24 మధ్య ఏపీలో జరిగిన రాక్షస పాలనను అంతమొదించేందుకు ప్రజాస్వామ్య పాలన అమలు చేయడంలో భాగంగా యువతను ఏకం చేసేందుకు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రభంజనం సృష్టించిందన్నారు. లోకేష్ 3132 కిలోమీటర్ల పాదయాత్రకు గుర్తుగా సర్వేపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు 3132 సైకిళ్ళు పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. తొలుత నియోజకవర్గంలోని అన్ని జెడ్పీ హైస్కూళ్లలో 8,9 తరగతులు చదువుతున్న విద్యార్థినులకు, రెండో దశలో 6, 7 తరగతుల విద్యార్థినులకీ సైకిళ్లు అందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సైకిల్ పంపిణీ తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం అయిన మార్చి 29వ తేదీ నాటికి 3132 మందికి సైకిళ్ల పంపిణీ పూర్తయ్యేలా ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయని సోమిరెడ్డి కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఇందులో బాగంగా సెయిల్ కంపెనీ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి 1841 సైకిళ్లు చేరాయి. ఆయా మండల కేంద్రాల్లో సైకిళ్ల తయారీలో భాగంగా టెక్నీషియన్లు సైకిళ్లను ఫిట్టింగ్ చేస్తుండటంతో సర్వేపల్లిలో సైకిళ్ల జాతర నెలకొన్నట్లయింది.

# శ్రీ ఖరేశ్వరస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రంలోని శ్రీ ప్రసన్న కామాక్షి సమేత కరేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహాశివరాత్రి పురస్కరించుకొని వేడుకలు నిర్వహించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆలయ మర్యాదలతో శివ పార్వతులను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ఆలయానికి విశిష్ట చరిత్ర ఉందని ఖరుడనేరాక్షసుని రాముడు సంహరించడంతోఈ ఆలయానికి ఖరేశ్వర ఆలయంగా పేరు వచ్చినట్లు తెలిపారు. ఈ పురాతన ఆలయ అభివృద్ధికి తమ కుటుంబీకులు సహకరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుత ఆలయ చైర్మన్ మన్నెం నీలిమ కమిటీ ఆధ్వర్యంలో ఈ ఆలయంలోమౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహా శివుని ఆశీర్వాదం పుష్కలంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర మండల మండల అధ్యక్షులు కోణతం రఘు బాబు మన్యం జితేంద్ర మాజీ ఎంపీటీసీ మన్నెం మధుసూదన్ గౌడ్ స్థానిక టీడీపీ నేతలు కార్యకర్తలు ఉన్నారు.

# జలదంకి జెడ్పీ హైస్కూల్‌లో 'పది'పై ప్రత్యేక నజర్

- ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన
- 100శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యా బోధన




**జలదంకి, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలలు అంటే కేవలం తరగతులు మాత్రమే కాదు, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులు అని నిరూపిస్తోంది జలదంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. రానున్న పదవ తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఈ పాఠశాల ఉపాధ్యాయ బృందం అడుగులు వేస్తోంది. ప్రైవేటు విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని రీతిలో ఇక్కడ విద్యాబోధన సాగుతుండటంతో అటు విద్యార్థుల్లో, ఇటు తల్లిదండ్రుల్లో పాఠశాల పట్ల అమితమైన విశ్వాసం నెలకొంది.

విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రతి రోజూ ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ వహిస్తూ, సబ్జెక్టుల వారీగా ఉన్న సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయడంలో ఉపాధ్యాయులు నిమగ్నమయ్యారు. సుదీర్ఘ సమయం పాఠశాలలో గడిపే విద్యార్థుల కోసం డాక్టర్ మాలినిదేవి దంపతులు మానవత్వంతో ముందుకు వచ్చారు. సాయంత్రం వేళల్లో విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన ఉపహారాన్ని అందజేస్తూ తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు. ఇది విద్యార్థులకు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోంది.

### సమిష్టి కృషితో సమున్నత ఫలితాలు..

పాఠశాల హెచ్‌ఎం వింజావళి, ఉపాధ్యాయులు తిరుపతయ్య, మాలాద్రి తదితరులు విద్యార్థుల అభ్యున్నతి కోసం అనునిత్యం శ్రమిస్తున్నారు. విద్యా కమిటీ చైర్మన్ సుందరయ్య పాఠశాల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారు. అలాగే ఈ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం సైతం తమ వంతు బాధ్యతగా పాఠశాల ప్రగతిలో పాలుపంచుకుంటోంది. ఎంతో మంది ఉన్నత అధికారులను, మేధావులను తీర్చిదిద్దిన ఘన చరిత్ర కలిగిన ఈ పాఠశాల, ఈ ఏడాది కూడా రాష్ట్ర స్థాయిలో సత్తా చాటడానికి సిద్ధమవుతోంది.

### మంచి ప్రాణాలికతో విద్యా బోధన చేస్తున్నారు

విద్యార్థిని తేరు కావ్య మాట్లాడుతూ.. మా పాఠశాలలో ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి మంచి ప్రణాళికతో విద్య బోధన చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతులు ప్రతి సబ్జెక్టుపై విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధిస్తూ విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధిం చేందుకు కృషి చేస్తున్నారు. మేము కూడా వారి సూచనలు పాటిస్తూ చక్కగా చదువుకుంటున్నాము.

### పదవ తరగతిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తాం

విద్యార్థి టీవీజీ వర్షిత్ మాట్లాడుతూ.. మా పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రధాన ఉపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు ఉత్తమ ర్యాంకులు సాధించే దిశగా మాకు తర్ఫీదు ఇస్తున్నారు. ప్రతి సబ్జెక్టుపై అవగాహన పెంచుతూ మంచి మార్కులు కృషి చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో మాకు అవసరమైన స్నాక్స్, పాలు అందిస్తూ మమ్మల్ని ఉన్నతంగా చదువుకునేందుకు ప్రేరేపిస్తున్నారు. వారి స్ఫూర్తితో మేము చక్కగా చదువుకుంటున్నాము. ఏడాది పదవ తరగతిలో 100శాతం ఉత్తీర్ణత వస్తుందని ఆశిస్తున్నాము.

# కోటేశ్వర స్వామిని దర్శించుకున్న గంగాధర్



**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలం లోని కోడూరు గ్రామంలో మహాశివరాత్రి పురస్కరించుకొని ఆదివారం కోడూరు సాగునీటి సంఘం అధ్యక్షులు టీడీపీ స్థానిక క్రియాశీలక నేత వీరబోయిన గంగాధర్ సందర్శించారు. ఆయనకు దేవస్థానం నిర్వాహకులు స్వాగతం పలికి ఆశీర్వదించారు. శివపార్వతులను దర్శించుకుని పూజలు జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోడూరు శివాలయం ప్రసిద్ధి చెందిందని తమ కుటుంబీకులు మాజీ సర్పంచ్ వీరబోయిన పెంచలయ్య ఈ ఆలయ నూతన శిఖర కళిశ ప్రతిష్టజరిపారన్నారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సహకారంతో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఆలయాన్ని దర్శించిన వారిలో మాజీ ఎంపీటీసీ బయిన బోయిన శ్రీనివాసులు సాగునీటి సంఘం ఉపాధ్యక్షులు చెరుకూరి పరంధామ నాయుడు, తంబిరెడ్డి వెంకటేశ్వర్లు, బత్తల వెంకటరమణయ్య, నక్క శివకుమార్, గోళ్ళ చెన్నకేశవులు, టిడిపి కార్యకర్తలు ఉన్నారు.

# బీసీవై పార్టీ జిల్లా అధ్యక్షునికి సత్కారం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** పద్మశాలి కుల బాంధవుడైన బుధవరపు బాలాజీని పద్మశాలి జిల్లా సంఘ పెద్దలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బుధవరపు బాలాజీ మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా పద్మశాలి సంఘాలలో, చేనేత సంఘాల్లో బీసీ సంఘాల్లో ఎన్నో కార్యక్రమాలు ఉద్యమాలు పోరాటాలు చేశాను. నా యొక్క ప్రయాణం నేపథ్యం గమనించి జాతీయ అధ్యక్షులు పార్టీ నాయకులు బోడె రామచంద్ర యాదవ్ జిల్లా అధ్యక్షులుగా నాకు ఈ బాధ్యత అప్పగించినందుకు ఆయనకు మరీ మరీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, బీసీవై పార్టీ తరఫున అన్ని వర్గాలను కలుపుకొని ప్రజా సమస్యల మీద మరింత బలంగా పనిచేస్తానని బాలాజీ అన్నారు. ఈ కార్యక్రమంలో శాసన మండల మాజీ సభ్యులు బూదాటి రాదయ్య, రిటైర్డ్ తాసిల్దార్ సానం శ్రీనివాసులు, రిటైర్డ్ ఈవో చేపూర్ రాధాకృష్ణయ్య, పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు అవ్వరు గజపతిరావు, పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జానపాటి రామసుబ్బయ్య, జిల్లా కార్యదర్శి కొప్పర్తి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి మార్కాపురం లక్ష్మీనారాయణ, బోడగల సురేష్, పచ్చరి వీరరాఘవులు, కందల పెంచలయ్య, జంజం సురేంద్ర పద్మశాలి సంఘ జిల్లా కమిటీ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆలయంలో శివరాత్రి ప్రత్యేక పూజలు



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని నడుమూరు నందు వేం చేసియున్న శ్రీ గురురప్ప స్వామి అంకాలమ్మ నాగవరపు అమ్మ వార్లకు ఆదివారం శివరాత్రి పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు గురవారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి అమ్మవార్లకు వేకువ ఝామున్నే పంచామృతాభిషేకములు జరిపించారు. అదేవిధంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారిని అమ్మవారిని సుగంధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కలిగించారు. భక్తులు ఉదయాన్నే ఆలయాన్ని చేరి స్వామివారిని అమ్మవాలను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. స్వామివారి కరుణాకటాక్షములకు పాత్రులయ్యారు.

# భక్తులతో పోటెత్తిన శివాలయం

**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని స్థానిక పెద్దూరులో ఉన్న శివాలయంలో ఆదివారం శివరాత్రి పర్వదిన సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా భక్తులు వేకువజాము నుండి ఆలయానికి చేరుకుని, ఆ పరమేశ్వరుని దర్శనం చేసుకుని తాము కోరిన కోర్కెలు తీరాలని పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

# ఉపాధి హామీ కాదు అవినీతికి హామీ పథకం


- గుట్టు చప్పుడు లేకుండా రహస్య తనిఖీలు చేపిస్తున్న ఎన్ఆర్‌జీఎస్ మండల అధికారులు
- కూలీలను చూపించేది వందలలో గ్రామసభలో మాత్రం 05 లేక 10, మంది
- గ్రామస్తులకే తెలియకుండా గ్రామ సభలు నిర్వహిస్తున్న టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిరుపేదల కోసం ప్రవేశపెట్టినది ఈ పథకంలో అవినీతి ఉండడంతో ఉపాధిలో పనిచేసే వారే తిమింగలంగా మారాడని తీవ్ర ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి సైదాపురం మండలంలోని పలు పంచాయతీలలో జరిగిన ఉపాధి కోట్ల హామీ గ్రామసభ సామాజిక తనిఖీల్లో అన్ని అక్రమాలే చోటు చేసుకున్నాయి. మండలంలో 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు మండలం మొత్తానికి తొమ్మిది రూపాయలు పైన వివిధ పనులకు ప్రభుత్వం ఖర్చు చేసింది. 17వ విడత ఉపాధి హామీ సామాజిక తనిఖీల్లో భాగంగా ఒక్క, ఎస్ఆర్పీ నలుగురు, డిఆర్పిలు గత పది రోజుల నుండి ఆయా గ్రామాలలో తనిఖీలు నిర్వహించి గ్రామసభలు నిర్వహిస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం గ్రామలలో కూలి చేసుకుంటూ గతంలో కట్టెలు కొట్టి జీవనం సాగిస్తున్న ఆ నిరుపేదల కోసం ప్రభుత్వాలు వారి బ్రతుకులలో వెలుగు చూడాలని ఉద్దేశంతో ఉపాధి హామీని ప్రవేశపెట్టినది. అయితే మండలంలో ఉపాధి తనిఖీలు చేస్తున్నప్పటికీ ఎవరికి తెలియకుండా గుట్టు సప్పుడుగా ఈ తనిఖిలు నిర్వహిస్తూ ఎవరికి తెలియకుండా గ్రామ సభలో నిర్వహిస్తూ కనీసం గ్రామంలో గ్రామ సభ పెడుతున్నామని ఆ గ్రామంలో ప్రజలకు కూడా తెలియకుండా కనీసం దండోరా వేయకుండా ప్రజలకు తెలియనీయకుండా పకడ్బందీగా ఈ గ్రామసభలు నిర్వహిస్తూ ఉండడంతో మండలంలోని ప్రజలు ఇది ఎంతవరకు న్యాయమని ఏ విషయమైనా అందరికీ తెలిసేలా గ్రామసభ నిర్వహించాలని ఆ గ్రామసభలో ముఖ్య సభ్యులుగా పంచాయతీ కార్యదర్శి మరియు గ్రామస్తులు అందరూ కలుసుకొని గ్రామ సభ నిర్వహించడం జరుగుతుంది . కానీ ఈ మండలంలో మాత్రం పనిచేసింది 200 మంది ఉంటే ఐదు మందితో గ్రామసభ నిర్వహించి గ్రామసభ అయిపోయిందన్న విషయాలు వెలుగులోనికి వస్తున్నాయి విషయాలపై డిఆర్పి చిన్న పెంచలయ్యను వివరణ అడగగా మేము పంచాయతీలోకి ఆడిట్ చేయుటకు వెళ్లే ముందు మండల సిబ్బంది ఏపీఓకి తెలియపరుస్తున్నాం. మా తనిఖీల్లో భాగంగా గ్రామాల్లో ఆడిట్ పూరచేసిన తర్వాత ప్రతి విషయం కూడా మండలంలోని ఏపీవోకు తెలుపుతున్నామని తెలిపారు. కానీ మండలంలో పనిచేసేటువంటి టి ఏ లు కానీ ఏపీవో కానీ ఈసీ కానీ ఎవరు కూడా పై విషయాలు ఏవి కూడా ప్రజలకు చేరే విధంగా చేసేటువంటి పాత్రికేయులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా గుట్టు చప్పుడు లేకుండా ఈ గ్రామ సభలో నిర్వహించడం గమనార్హం.

**గ్రామంలో లోటుపాట్లు :** ఉపాధి హామీ పథకంలో ఈ పంచాయతీల్లో జరిగినటువంటి సోషల్ ఆడిట్లో అవినీతి భారీగా జరిగిందని ప్రజలలో విమర్శలు వినిపిస్తున్నాయి ఎందుకంటే గ్రామంలో ఒక గ్రామసభ నిర్వహించేటప్పుడు ముందు రోజున గ్రామస్తులందరికీ కూడా తెలియపరిచే విధంగా ఒక దండోరా అనేది వేయడం జరుగుతుంది కానీ ఇక్కడ అటువంటి ఏవి కూడా చేయకపోవడం గమనార్హం అంతేకాకుండా ప్రతి గ్రామ సభలో చేసిన కూలీల సంఖ్య కంటే ఐదు పది మంది గ్రామసభలో కనబడడం విడ్డూరంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. ఉపాధి హామీ పథకం పోయే కూలీలు రోజువారి మాస్టర్లో సంతకాలు ఒకరే పెట్టినట్టు కనిపించడం ఆశ్చర్యం కలిగేట్టు ఉండడమైనది అంతేకాకుండా కొని హాజరులు చనిపోయిన వారి పైన కూడా బిల్లులు తీసుకోవడం జరిగింది అంతేకాకుండా గ్రామ సభకు పనిచేసిన కూలీలే కాకుండా ఇతరులను తీసుకువచ్చి గ్రామ సభకు హాజరు పరుస్తున్నారన విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల వ్యాప్తంగా ఉన్న పంచాయతీలలో పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు చర్చించు కుంటున్నారు. ఉన్నత అధికారులు దీనిపై దృష్టి పెట్టి ఉపాధిలో జరిగిన అవినీతిని ఖండించి ప్రజాధనం కాపాడాలని ప్రజలు తమ ఆవేదన వ్యక్తపరిచారు.

## బీసీ సింహ గర్జన జయప్రదం చేయండి



**నెల్లూరు/సంగం, మేజర్‌న్యూస్ :** బీసీ సింహ గర్జన జయప్రదం చేయాలని బీసీవై పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం సంఘం గ్రామంలో బస్టాండ్ సెంటర్లో బీసీ సింహ గర్జన గోడ పత్రికల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బుధవరపు బాలాజీ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ బీసీ సింహ గర్జన కార్యక్రమం బోడె రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో గుంటూరు హైవే నాగార్జున యూనివర్సిటీ క్యాంపస్ ఎదురుగా పూలే ప్రాంగణమునందు జరుగుతుందని ఈ కార్యక్రమంలో భాగంగా ఈరోజు సంఘం మండలం సంఘం గ్రామంలో అన్ని వర్గాల ప్రజలను కలుస్తూ అందరికీ కరపత్రాలు పంచుతూ అన్ని వర్గాల ప్రజలను ఆహ్వానిస్తున్నాము. ఈ సింహగర్జన ప్రధానజెండా బీసీలకు స్థానిక సంస్థల్లో 44శాతం రిజర్వేషన్లు, బిసి కార్పొరేషన్‌కు నిధులు, బీసీ రక్షణ చట్టం, బిసి వర్గాలకు రాజధాని ప్రాంతంలో 1000 ఎకరాల భూమి కేటాయింపులు జరగాలని ప్రధాన అజెండాగా తీసుకొని మా జాతీయ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ ఈ బీసీ సింహగర్జన ప్రతి పల్లెకు పట్టణానికి నగరానికి తెలియజేస్తూ అన్ని వర్గాలకు పిలుపునిస్తూ ఈ బీసీ సింహగర్జనకు వేలాదిగా తరలిరావాలని పిలుపునిస్తున్నామని అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొలిటికల్ అఫైర్స్ కమిటీ సభ్యులు ఎస్ఎస్ యాదవ్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ సోమ గోపాల్, జిల్లా యువజన విభాగం వంకాయల ఉదయ్, వంకాయల చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ మీద అసత్య ప్రచారాలు మానుకోవాలి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** భారతీయ జనతా పార్టీ జలదంకి మండల కార్యాలయంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముడి కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ నాయకులు వైయస్ షర్మిల చేసిన అసత్య ప్రచారాలను తీవ్రంగా ఖండించారు. మండల అధ్యక్షుడు ముడి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ మీద వైయస్ షర్మిల చేసిన వ్యాఖ్యలు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేయడం సరికాదని అన్నారు. బీజేపీ జిల్లా కార్యదర్శి మారెళ్ళ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ.. కొత్త విధాన సంస్కరణలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేస్తాయని తెలిపారు. ఉపాధిని కేవలం రోజువారీ కూలీ పనిగా కాకుండా స్థిరమైన జీవనోపాధి దిశగా మలుస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ యువతకు నైపుణ్య అభివృద్ధి అవకాశాలు పెరుగుతాయని, రైతులకు చెక్‌డ్యామ్‌లు, నీటి సంరక్షణ పనులు, మౌలిక సదుపాయాల అభివృద్ధి ద్వారా పరోక్ష లాభం కలుగుతుందని వివరించారు. వారికి రావలసినటువంటి రోజు వారి మొత్తాన్ని గడువు లోపల ఇవ్వకుంటే ఆ మొత్తానికి సగటు వడ్డీ వేసేవిధంగా కొత్త చట్టంలో మార్పులు చేశారని తెలిపారు. బీజేపీ జిల్లా కార్యదర్శి వడ్డే శ్రీనాథ్ మాట్లాడుతూ మూడు రోజుల క్రితం కావలి పర్యటనలో వైయస్ బీజేపీపై చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. దేశంలో అమలులో ఉన్న ఉపాధి హామీ చట్టం రద్దు కాలేదని, ఉపాధి హక్కు కొనసాగుతోందని స్పష్టం చేశారు. ప్రజలను తప్పుదారి పట్టించే ప్రచారాలు ఆపాలని సూచించారు. గతంలో ఈ పథకంలో ఫేక్ జాబ్ కార్డులు, నిధుల దుర్వినియోగం, అవకతవకలు జరిగాయని గుర్తు చేస్తూ, ప్రస్తుతం ఆధునిక సాంకేతిక విధానాల ద్వారా అవినీతి తగ్గించబడిందని తెలిపారు. రాజకీయ లాభం కోసం పేదల ఉపాధి అంశాన్ని వక్రీకరించడం తగదని పేర్కొన్నారు. కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు చల్లా హనుమా రెడ్డి మాట్లాడుతూ.. ఈ పథకం ద్వారా రైతులకు పరోక్ష లాభాలు అధికమవుతాయని తెలిపారు. చెక్‌డ్యామ్‌లు, నీటి సంరక్షణ పనుల వల్ల సాగునీటి లభ్యత పెరిగి వ్యవసాయ ఉత్పాదకత పెరుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి రైతు ఆదాయాన్ని పెంచే దిశగా దోహదపడుతుం దని అన్నారు.మండల ప్రధాన కార్యదర్శి వంటేరు రాకేష్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆధార్ లింకింగ్, డిజిటల్ హాజరు నమోదు, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ వంటి ఆధునిక సాంకేతిక పద్ధతుల వల్ల అవినీతి గణనీయంగా తగ్గి పారదర్శకత పెరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షులు మాతిన వెంకటరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు నేలపాటి ముసలయ్య, యువ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి కుట్టుబోయిన ప్రవీణ్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం మండలంలోని పలు శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయగిరి మండలంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని శ్రీపార్వతీపరమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించి పట్టణ పురవీధుల్లో గ్రామోత్సవం చేపట్టారు. మండలంలోని గండిపాళెం జలాశయ ఆవరణలో వెలసి ఉన్న శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయానికి భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ కల్యాణవేదిక వద్దకు చేర్చి కన్నుల పండువగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామ పురవీధుల్లో స్వామివార్ల గ్రామోత్సవం చేపట్టారు అలాగే మండలంలోని లింగాలదొన క్షేత్రం, యర్రబల్లిగడ్డ, గుడినరవ, అప్పసముద్రం, అర్లపడియ, జీ.అయ వారిపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి కాయాకర్పూరం అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు భక్తుల సౌకర్యార్థం అన్నదానంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి పూజలు




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం గ్రామం సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పూజా కార్యక్రమం చేసి దర్శనం చేసుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ మామిడాల శ్రీనివాసులు ఆహ్వానం మేరకు ఆయన ఆలయానికి విచ్చేసి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. పూజా కార్యక్రమాలు అనంతరం తీర్థప్రసాదాలు తీసుకు న్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. కృష్ణపట్నం ఆలయాలకు కోట్లాది రూపాయల సంపద ఉన్నట్లు ఈ సంపదను ఆల యాల అభివృద్ధికి ఖర్చు పెడతామన్నారు. పరిశ్రమల యాజమాన్యాలు సిఎస్ఆర్ నిధుల ద్వారా గిరిజన కుటుంబాలకు సహకారం అందించాలని ఎమ్మెల్యే సోమిరెడ్డి పేర్కొన్నారు. అనంతరం కృష్ణపట్నం పోర్టు ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని సీఈఓ జగదీష్ పటేల్ తో కలిసి ప్రారం భించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు నీలం మల్లికార్జున యాదవ్, నాయకులు గ్రామస్తులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కావలి ఎడవల్లిలో ఉచితంగా గ్యాస్ సిలిండర్లు పంపిణీ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఏఎస్ పేట మండలం కావలి ఎడవల్లి గ్రామంలో ప్రధాన మంత్రి ఉజ్వల యోజన గ్యాస్ పథకం ద్వారా మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను పంపిణీ చేశారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి సూచనలు ఆశీస్సులతో మండలంలోని కావలి ఎడవల్లి గ్రామ సచివాలయ పరిధిలో, నెల్లూరు జిల్లా మాజీ తెలుగుదేశం పార్టీ యువత అధ్యక్షులు ఏలూరి మాలాద్రి నాయుడు చేతులమీదుగా గ్రామంలో ప్రధానమంత్రి ఉజ్వల యోజన గ్యాస్ పథకం కింద ఉచితంగా 20 మంది పేద మహిళలకు గ్యాస్ కనెక్షన్లు, గ్యాస్ స్టౌవ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కావలి ఎడవల్లి గ్రామ సర్పంచ్ ముప్పూరి. ధనమ్మ వార్డు సభ్యులు మన్నం మోహన్ రావు కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివాలయంలో ఆయుష్ వైద్య శిబిరం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** గండవరములోని శివాలయము ప్రాంగణములో శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వస్తున్న భక్తులకోసము ఉచిత ఆయుష్ శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 150 మందికి ఆరోగ్యపరిక్షలు నిర్వహించి ఉచితముగా ఆయుర్వేద హోమియో మందులను ఇచ్చినారు ఈ క్యాంపులో హోమియోవైద్యులు డా కరుణాకర్ ఆయుర్వేద వైద్యులు డా హేమంత్ బాబు, డా గీతా, డా విజయలక్ష్మి స్టాఫ్ రామక్రిష్ణ సుబ్రమన్యమ్ మాల్యాద్రి పాల్గొన్నారు.

# పొదలకూరులో నయనానందకరంగా శివరాత్రి బ్రహ్మోత్సవాలు

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల వేళ పొదలకూరులోని పురాతన శివాలయం భక్తిరససింధువై అలరారుతోంది. విద్యుద్దీపాల కాంతుల్లో వెలిగిపోయిన ఆలయ ప్రాంగణం, నాదస్వర ధ్వనులతో మార్మోగిన వీధులు, 'హర హర మహాదేవ" నినాదాలతో ఉప్పొంగిన భక్తజనం. ఇలా తొలి రోజే ఉత్సవాలకు ఘన శ్రీకారం చుట్టారు. శనివారం సాయంత్రం అంకురారోహణతో ప్రారంభమైన వేడుకలు, రాత్రి ధ్వజారోహణతో మరింత భక్తి వైభవాన్ని సంతరించుకున్నాయి. అనంతరం జరిగిన రావణసేవ ఉత్సవం విశేష ఆకర్షణగా నిలిచింది. రావణ వాహనంపై అలంకారభూషితుడై విరాజిల్లిన పరమేశ్వరుడు పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. స్వామివారి దివ్యమూర్తిని దర్శించుకునేందుకు మహిళలు, యువత, చిన్నారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

**రావణసేవకు ప్రత్యేకత ఉంది :** శివభక్తుల్లో అగ్రగణ్యుడైన రావణుడు తన భక్తిశ్రద్ధలతో పరమేశ్వరుని ప్రసన్నం చేసుకున్నాడనే తత్వాన్ని ఈ వాహనసేవ తెలియజేస్తుంది. అహంకారాన్ని అధిగమించిన భక్తి, శరణాగతి మహిమను చాటే ఉత్సవంగా దీన్ని భావిస్తారు. స్వామివారి కటాక్షం లభిస్తే కష్టాలు తొలగి సుఖసంతోషాలు నెలకొంటాయని భక్తుల విశ్వాసం. వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా, ఉభయ కర్తలుగా కోడూరు శ్రీనివాసులు, దేవాంగ సంఘం వారు బాధ్యతలు చేపట్టారు. ఉత్సవాల నిర్వహణలో ఆలయ కమిటీ, సేవాదళ సభ్యులు సమన్వయంతో కృషి చేశారు. రావణ వాహనాధీశుడైన స్వామివారిని దర్శించుకున్న వారు శుభఫలితాలు పొందుతారని ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్ స్వామి తెలిపారు. బ్రహ్మోత్సవాలు తదుపరి రోజుల్లో మరింత వైభవంగా కొనసాగనున్నాయి. భక్తజనం భారీగా తరలివచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు వెల్లడించారు.



# వేడుకగా సుందరేశ్వర స్వామి మహాశివరాత్రి వేడుకలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్టలో వేంచేసియున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానము ప్రాంగణములో ప్రతిష్ఠించబడిన శ్రీ సుందరేశ్వర స్వామి దేవస్థానము నందు మహాశివరాత్రి సందర్భముగా దేవస్థాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యములో ఉదయం 5 గంటలకు విఘ్నేశ్వర పూజ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, 8.30 గంటలకు రుద్రహోమము, 10 గంటలకు గిన్నెభిక్ష, రాత్రి 7.30 గంటలకు శ్రీస్వామి వారికి కుంభ హారతులు, రాత్రి 10.30 గంటలకు లింగోద్భవ అభిషేకము, రాత్రి 1 గంటకు నంది సేవ వైభవముగా జరిగినది. భక్తులు విశేష సంఖ్యలో శ్రీవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించుట జరిగినది. ఈ కార్యక్రమములకు ఉభయకర్తలుగా కీర్తిశేషులు ఆల్తూరు ఆదినారాయణ రెడ్డి జ్ఞాపకార్థం వారి శ్రీమతి అల్తూరు సులోచనమ్మ, కుటుంబ సభ్యులు గిరీష్ కుమార్ రెడ్డి -లత, మహేష్ కుమార్ రెడ్డి - రాధికలు వ్యవహరించారు. శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి జరిగిన చందన అలంకారమునకు ఉభయ కర్తలుగా దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శిరీషమ్మ దంపతులు వ్యవహరించారు. ఉదయం 10 గంటలకు శ్రీ కొండూరు హరిఎనారాయణరెడ్డి ఆధ్వర్యములో శ్రీ రాజ రాజేశ్వరి అమ్మవారికి 48వ లలితా లక్ష కుంకుమార్చన కార్యక్రమము, భక్తులకు అన్నదానము చేయుట జరిగినది. ఈ కార్యక్రమములో ఆలయ సహాయ కమీషనరు, కార్య నిర్వహణాధికారి కోవూరు జనార్ధన్ రెడ్డి, ఆలయ చైర్మన్ ఏలూరు శిరీష, ధర్మకర్తల మండలి సభ్యులు ఆలయ ప్రధాన అర్చకులు వేదవండితులు అర్చకులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షణలో జరిగాయి.

# సీసీ రోడ్డు పనులకు సీఎం గ్రీన్ సిగ్నల్ : మంత్రి ఆనం

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** సోమశిల గ్రామంలోని కోటి 50 లక్షల సిమెంట్ రోడ్డు పనులకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని సోమశిల గ్రామంలోని శ్రీ కామాక్షి సమేత సోమేశ్వర ఆలయం, చిలకలమర్రి గ్రామంలోని మల్లెం కొండేశ్వర స్వామి ఆలయంలో మంత్రి ఆనం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వంశపార ధర్మ కర్తలు ఉప్పల సోమ సుందర మూర్తి, ఉప్పల విజయ్ కుమార్, చిలకల మర్రిలో మునగపాటి సునీత సుబ్బరాజు ఘన స్వాగతం పలికారు. అనంతరం గాంధీ బొమ్మ వద్ద ఏర్పాటుచేసిన ఎస్టీ కాలనీ సిమెంట్ రోడ్డు కు మంత్రి ఆనం మాజీ ఎంపీటీసీ మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యోగు పెంచలయ్య ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సోమశిల ప్రాజెక్టు చైర్మన్ వేలూరు కేశవ చౌదరి, మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు మెట్టుకూరు కృష్ణారెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పాతపాటి మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## పేద కుటుంబాలకు భరోసాగా సీఎంఆర్‌ఎఫ్

- అత్యవసర వైద్యసేవలకు కోట్లాది రూపాయలు మంజూరు
- ఇప్పటివరకు 660మందికి రూ.6.40 కోట్లు మంజూరు
- రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** పేదల ఆరోగ్యభద్రతకు అత్యధిక ప్రాధాన్యత నిస్తూ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ భరోసాగా నిలుస్తుందని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం మహాశివరాత్రి సందర్భంగా నియోజకవర్గంలోని శైవ క్షేత్రాల సందర్శనలో భాగంగా 20 కుటుంబాలకు రూ.23.35 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధిత కుటుంబసభ్యులకు మంత్రి ఆనం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో మన రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లోని కార్పొరేటు ఆసుపత్రుల్లో వైద్యచికిత్సలు పొందిన కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా ఒక్కొక్క కుటుంబానికి లక్షలాది రూపాయలు ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉదారంగా మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఒక్క ఆత్మకూరు నియోజకవర్గంలో తమ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 640మందికి రూ.6కోట్ల 40 లక్షలు మంజూరు చేసి ఆ కుటుంబాలకు అండగా నిలిచినట్లు చెప్పారు. పేదల సంక్షేమంతో పాటు ఆరోగ్య భద్రతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు తాళ్లూరు గిరినాయుడు, వేలూరు కేశవ చౌదరి, తుమ్మల చంద్రా రెడ్డి, గోపారం వెంకటరమణమ్మ, కేతా వేణు గోపాల్ రెడ్డి, కేతా విజయభాస్కర్ రెడ్డి, సూరా భాస్కర్ రెడ్డి, పులిమి శైలజారెడ్డి, కొప్పోలు రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## మహాశివుని ఆశీస్సులు అందరికీ ఉండాలి



**సీతారాంపురం, మేజర్‌న్యూస్ :** మహా శివుని ఆశీస్సులు అందరికీ ఉండాలని, శివునికి అత్యంత ప్రీతికరమైన రోజు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదివారం ఘటిక సిద్దేశ్వరంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహించి, అన్నపూర్ణాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివరాత్రి జాగారానికి వచ్చే భక్తులకు చేసిన ఏర్పాట్లు పట్ల ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేతుల మీదుగా అన్న ప్రసాదాలు వడ్డించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, శాంతి భద్రతలను పోలీసులు పరిరక్షించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీతారాంపురం, ఉదయగిరి, దుత్తలూరు, వింజమూరు నాయకులు పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి శివపార్వతుల కరుణాకటాక్షాలకు పాత్రులయ్యారు.

## సంగమేశ్వర స్వామి సన్నిధిలోఎమ్మెల్యే సోమిరెడ్డి



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** మహాశివరాత్రిని పురస్కరించుకుని మనుబోలు మండలం బద్దెవోలు క్రాస్ రోడ్డు సమీపంలోని శ్రీ కామాక్షి సమేత సంగమేశ్వర స్వామి దేవస్థానాన్ని ఆదివారం సందర్శించిన సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సంప్రదాయ స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు శ్రీ పరమేశ్వరుడి కళ్యాణోత్సవాన్ని తిలకించి వేద పండితుల ఆశీస్సులు అందుకోవడంతో పాటు అన్నప్రసాదం స్వీకరించిన సోమిరెడ్డి. శ్రీ కామాక్షి సమేత సంగమేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరితో పాటు ప్రతిపక్ష నాయకులకు సైతం ఉండాలని, వారికి మంచి బుద్ధులు ప్రసాదించాలని దేవుడిని కోరుకుంటున్నానన్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. టిడిపి నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య. మనుబోలు నీటి సంఘం అధ్యక్షులు పచ్చిపాల రామిరెడ్డి. జట్ల కొండూరు నీటి సంఘ అధ్యక్షుడు ఏలూరు కోదండరామిరెడ్డి. తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి ఎస్కే అమీర్ భాష. కలికి రమేష్ రెడ్డి రాయపాటి కిరణ్ కుమార్. పచ్చిపాల చంద్రశేఖర్ రెడ్డి చల్లగిరి ప్రసాద్. పచ్చిపాల శ్రీకాంత్ రెడ్డి. రావుల జితేంద్ర. సాని వెంకట రమణయ్య శివుడు రాజా గౌడు. ఏకాంబరం సుబ్బయ్య. చింతల వెంకటేశ్వర్లు. తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రి సందర్భంగా అన్నదానం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ముత్తుకూరు మండలం బ్రహ్మదేవం గ్రామంలో శ్రీ కైలాస నాదేశ్వర స్వామి ఆలయంలో అంగరంగ వైభవంగా మహా శివరాత్రి వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి అన్నదాన కార్యక్రమం చేశారు. ఆలయ అర్చకులు కొత్తపల్లి రమేష్ కుమార్ శర్మ కుటుంబ సభ్యులు కొత్తపల్లి మధు, సురేష్, ఆధ్వర్యంలో పచ్చని తోరణాల మధ్య మంగళ వాయిద్యాలతో వైభవంగా స్వామివారి అమ్మవారి కళ్యాణ మహోత్సవం జరిగింది. కళ్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అదుపుతప్పి సూచికబోర్డును ఢీకొన్న కారు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణ శివారు ప్రాంతమైన కావలి మార్గంలో 167-బీజీ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి సూచికబోర్డును ఢీకొట్టడంతో పలువురి గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసు కొంది. వివరాల మేరకు. ఆత్మకూరుకు చెందిన ఓ వ్యక్తి తన ఇద్దరి పిల్లలతో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రాలైన ఘటికసిద్ధేశ్వరం, బైరవకోనకు వెళుతున్నారు. ఈ తరుణంలో పట్టణ శివారు ప్రాంతానికి రాగానే వెనుక సీట్లో కూర్చొని ఉన్న తన చిన్న కుమార్తె ముందుకొచ్చి స్టీరింగ్ పట్టుకోవడంతో కారు అదుపుతప్పి సూచికబోర్డును ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే బెలూన్స్ తెరుచుకోవడంతో కారులో ఉన్న వారికి స్వల్ప గాయాలు కాగా కారు ముందుభాగం, అద్దాలు ధ్వంసమయ్యాయి. అటుగా వస్తున్న వాహనదారులు గుర్తించి బయటకు తీసి చికిత్స నిమిత్తం ఆత్మకూరుకు తరలించారు.

# శివుడి సన్నిధిలో ప్రమాణం..

## ఆరోపణలు అసత్యం : సోమిరెడ్డి



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పలు శివాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాకుటూరు శివాలయం భూముల వ్యవహారంలో తనపై వచ్చిన ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. వెంకటాచలం మండలంలోని కనుపూరు శ్రీ మూలస్థానేశ్వర స్వామి దేవస్థానం, అడవిలోని అభయలింగేశ్వర స్వామి ఆలయం, కాకుటూరులోని శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయాలను దర్శించుకున్న ఆయన, అడవిలోని శివాలయంలో స్వయంగా అభిషేకం చేశారు. అక్కడ మధ్యాహ్నానికే సుమారు 40 వేల మంది భక్తులు విచ్చేసినట్లు నిర్వాహకులు తెలిపినట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది శివరాత్రి నాటికి భక్తులకు అవసరమైన వసతులు కల్పించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కాకుటూరు శివాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ, 'శివుడి సన్నిధిలోనే చెబుతున్నాను.. నేను దేవుడి భూమిని కోటి రూపాయలకు అమ్మేశాననే ఆరోపణలు పూర్తిగా నిరాధారం. అలాంటి పాపం చేసివుంటే నాశనమైపోతాను' అని అన్నారు. దేవాలయాల పట్ల తమ కుటుంబానికి ప్రత్యేకమైన అనుబంధం ఉందని, పలు ఉత్సవాలకు ఉభయ కర్తలుగా వ్యవహరిస్తున్నామని వివరించారు. తమ కుటుంబ భూములను కూడా దేవాలయాలకు అప్పగించిన విషయాన్ని గుర్తుచేశారు. కృష్ణపట్నం శివాలయం భూములను పోర్టు కోసం సేకరించిన సమయంలో ఎకరాకు రూ.3లక్షలకు బదులుగా రూ.7లక్షలకు పైగా ఇప్పించామని తెలిపారు. ప్రస్తుతం ఆ దేవాలయ ఖాతాలో రూ.100కోట్లకు పైగా నిధులు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాకు వచ్చిన ఇరిగేషన్ నిధులను తానే దుర్వినియోగం చేశానని చేస్తున్న ఆరోపణలను ఖండిస్తూ, వ్యక్తిత్వ హనన రాజకీయాలు సమాజానికి హానికరమని అన్నారు. తల్లిదండ్రులను దూషించే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా చట్టసవరణ చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు.

# శివనామ స్మరణలో తరించిన మంత్రి నారాయణ



- సతీసమేతంగా మూలస్థానేశ్వరుని దర్శనం
- ఆలయాల పునరుద్ధరణకు అధిక ప్రాధాన్యత ఇస్తాము
- ఏడాదిన్నరలో వేణుగోపాలస్వామి ఆలయ ? నిర్మాణం పూర్తి చేస్తాము
- మంత్రి ఆనం సహకారంతో సిటీ నియోజకవర్గ ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తా

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ రాష్ట్రాభివృద్ధికి, పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన బడ్జెట్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ బడ్జెట్ వల్ల ఉద్యోగ అవకాశాలు మెరుగుపడి ఆర్థిక పరిస్థితి మరింత బలోపేతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మహాశివరాత్రి సందర్భంగా సతీమణి రమాదేవితో కలిసి నెల్లూరులోని మూలాపేట శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామి, విరాట్ నగర్‌లోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరికీ అష్టైశ్వర్యాలు కలగాలని కోరుకున్నానని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. ముఖ్యంగా నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని ఆలయాలను మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సహకారంతో అభివృద్ధి చేస్తున్నామని, వేణుగోపాలస్వామి ఆలయ నిర్మాణాన్ని ఏడాదిన్నరలో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ధర్మం, సత్యం, సమానత్వమే ధ్యేయంగా, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి మేయర్ రూప్ కుమార్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ, మాజీ జెడ్పిటిసి విజేత రెడ్డి, నగర అధ్యక్షుడు మామిడాల మధు, మూలస్థానేశ్వర స్వామి ఆలయ చైర్మన్ పుట్ట అజయ్, పాలకమండలి సభ్యులు, 40వ డివిజన్ ప్రెసిడెంట్ గంగవరం నాని, డిప్యూటి మేయర్ తహసీన్ ఇంతియాజ్ పాల్గొన్నారు. అలాగే వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ అధ్యక్షుడు చంగయ్య ఆచారి, శ్రీహరి, బాలకృష్ణ ఆచారి, రమణయ్య ఆచారి, 47వ డివిజన్ కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ, 48వ డివిజన్ అధ్యక్షుడు పెంచలయ్య, స్థానిక టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు ఈ వేడుకలో భాగస్వాములయ్యారు.

# నెల్లూరు సుందరీకరణే లక్ష్యం.. పేదల సంక్షేమమే ధ్యేయం

- నెల్లూరులో పేదల సంక్షేమ జాతర
- ఆపదలో అండగా.. ఉపాధికి కొండంత ఆసరాగా..? నెల్లూరు సిటీలో మంత్రి నారాయణ మార్క్ పాలన
- ఒకే వేదికపై 17 లక్షల చెక్కులు, తోపుడు బండ్లు, పట్టాల పంపిణీ
- గత ఏడాదిన్నర కాలంలో నెల్లూరు సిటీలో 325 మందికి రూ.3,32,93,551 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ
- ఏడాదిన్నరలో మొత్తం 675 మంది పేదలకు తోపుడు బండ్లు అందజేసిన మంత్రి దంపతులు
- సతీమణి రమాదేవితో కలిసి 17 మందికి ఇళ్ల పట్టాలు అందజేసిన మంత్రి నారాయణ



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** నెల్లూరు గోమతీ నగర్ క్యాంపు కార్యాలయంలో ఆదివారం సతీమణి రమాదేవితో కలిసి మంత్రి నారాయణ నిర్వహించిన సేవా కార్యక్రమం ఒక జాతరను తలపించింది. ఇందులో భాగంగా 17మంది లబ్ధిదారులకు రూ.17,28,220 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను, 101 మంది వీధి వ్యాపారులకు ఉపాధి కోసం తోపుడు బండ్లను, 17 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి పేదల పాలిట పెన్నిధిలా నిలిచారు. ఏడాదిన్నర కాలంలో నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 325 మందికి రూ. 3.32 కోట్లకు పైగా వైద్య సహాయం, 675 మందికి తోపుడు బండ్లు అందజేసిన మంత్రి, ఎన్నికల సమయంలో అద్దె బండ్లతో ఇబ్బంది పడుతున్న వ్యాపారులకు ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ఈ నిరంతర పంపిణీ చేపడుతున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు మానసపుత్రిక పీ4 విధానంతో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని, భగత్ సింగ్ కాలనీ వాసుల 30 ఏళ్ల కలను నెరవేర్చి 1,400 మందికి శాశ్వత పట్టాలు మంజూరు చేయించడమే కాకుండా, నగరం మొత్తంలో 5 వేల మందికి పట్టాలు ఇవ్వడమే తన లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. నెల్లూరును ముంపు నుండి తప్పించేందుకు కాలువల ఆధునీకరణ చేస్తూ, గత ప్రభుత్వ అవకతవకలను



సరిదిద్ది నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, టీడీపీ నగర అధ్యక్షులు మామిడాల మధు, మాజీ జెడ్పిటీసీ విజేతా రెడ్డి ,క్లస్టర్ ఇన్చార్జులు, డివిజన్ ప్రెసిడెంట్లు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## పెన్నానది గర్భంలో.. సైకితలింగానికి పూజలు



**నెల్లూరు బ్యూరో, మేజర్‌న్యూస్ :** పినకిని స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పెన్నానది గర్భంలో సైకిత లింగేశ్వరునికి పూజలునిర్వహించారు. ఈ పూజలును మునీంద్రస్వామి, నాగేంద్ర స్వామి, పినాకిని స్విమ్మర్ అసోసియేషన్ సభ్యులు పూజలు నిర్వహించారు. పెరుగు తేనే, కొబ్బరి నీరు, గంధం, విభూతి, చందనం, పుష్పలతో అర్చన చేసి పూజలు నిర్వహించడం జరిగిందని నెల్లూరు పినాకిని స్విమ్మర్ అసోసియేషన్ అధ్యక్షులు మోపురు పెంచలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ నాగేశ్వరరావు, టి.వెంకటేశ్వర్లు, మస్తానయ్య, బుజ్జయ్య, మోహన్, శేషు ఆచారి, సుధాకర్, గౌరీ, ఇరుకాలయ్య,ప్రకాశం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మూలస్థానేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శివరాత్రి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని నెల్లూరు మూలపేట శ్రీ భువనేశ్వరి సమేత శ్రీ మూలస్థానేశ్వర స్వామిని వైసీపీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో చంద్రశేఖర్ రెడ్డి దీపాలు వెలిగించి శివుని ఆరాధన చేశారు.ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి వెంట వైఎస్‌ఆర్సిపి స్టేట్ సెక్రటరీ పేర్నాటి కోటేశ్వర రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి, చిదేళ్ళ కిషన్ వైసీపీ నాయకులు మాణికల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం లారీ పట్టివేత, లారీ సీజ్



**మనుబోలు, మేజర్‌న్యూస్ :** చెన్నై కలకత్తా 16 నెంబర్ జాతీయ రహదారిపై రేషన్ బియ్యం తరలిస్తున్న లారీను ఎస్సై సివిల్ సప్లై అధికారులు ఆదివారం వల పని పట్టుకున్నారు. పట్టుకున్న లారీని సీజ్ చేసి బియ్యాన్ని పొదలకూరు సివిల్ సప్లై గోడౌన్కు తరలించి ఎస్ఐ శివ రాకేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దీనికి సంబంధించిన పూర్వపరాలు ఈ విధంగా ఉన్నాయి. ప్రకాశం జిల్లా దర్శి నుండి ఏపీ 26.టీఎల్.6953 అనే లారీలో చెన్నైకి రేషన్ బియ్యం తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో మనుబోలుకి ఉత్తరంగా కాగితాల పూర్ రోడ్డులో ఎస్ఐ శివ రాకేష్ రెవెన్యూ సిబ్బంది మాటువేసి లారీని ఆపి తనిఖీ చేశారు. లారీలో ఉన్న 14.70లక్షల రూపాయలు విలువైన 700 బస్తాలు 35వేల కేజీల బియ్యం గుర్తించారు. నెల్లూరు. ఏఎస్ఓ(సివిల్ సప్లై) లక్ష్మీ నారాయణరెడ్డిరెడ్డి మనుబోలు సీఎస్‌డీటీ రవి, వీఆర్వో గుణశేఖర్ లారీని సీజ్ చేసి ఎస్ఐ శివరాకేష్ సమక్షంలో కేసు నమోదు చేశారు. మధ్యవర్తులుగా రేషన్ షాపు డీలర్లు గోను దసయ్య ఉచ్చూరు దయాకర్ రెడ్డి. కోసూరు సురేష్ సమక్షంలో సీజ్ చేసినట్లు వీఆర్వో గుణశేఖర్ తెలిపారు.

## సైదాపురంలో వైభవంగా మహాశివరాత్రి వేడుకలు

**సైదాపురం, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని పలు గ్రామాల్లో మహాశివరాత్రి వేడుకలు ఎంతో ఘనంగా భక్తిశ్రద్ధలతో, పరమ శివునికి అభిషేకాలు అర్చనాలు శివపార్వతుల కళ్యాణ మహోత్సవం కన్నుల పం డుగగా జరుగుతున్నాయి. ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆల యాలకు తరలివచ్చి అత్యంత భక్తి శ్రద్ధలతో ఆదిదేవునికి ప్రత్యేక పూజలు అర్చనలు అభిషేకాలను దేవాలయ అర్చకులు రమణయ్య స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈనేపథ్యంలో శివలింగేశ్వరస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు రమణయ్యస్వామి మాట్లాడుతూ.. శివరాత్రి రోజున భక్తిశ్రద్ధలతో శివనామం జపిస్తూ, చేపట్టే ఉపవాస దీక్షలు, రాత్రి జాగరణ, పూజలు అభిషేకాలు వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రతీ ఒక్కరిలో ఆత్మశుద్ధిని, పరివర్తనను కలిగిస్తాయని అన్నారు. భక్తిశ్రద్ధలతో శివరాత్రి పండుగను జరుపుకున్నారు లయకారునిగా, అర్ధనారీశ్వరునిగా హిందువులు కొలిచే ఆ మహాదేవుని దీవెనలతో అందరి జీవితాలు సుభిక్షంగా ఉంటుంది.